

గ్రామాల్లో రెవెన్యూ కోర్టులు

పార్వతీపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ కోర్టులు నిర్వహించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. పిటిషనర్లను కార్యాలయానికి పిలిపించకుండా వారి వద్దకే వెళ్లి న్యాయాన్ని అందించాలన్నారు. శనివారం పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్‌తో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రెండు డివిజన్లలో సుమారు 120 కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వాటన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ కోర్టుల నిర్వహణకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, నిర్దిష్ట ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు.

వేడుకలకు వేళాయే..

- రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయాలు
- నిజరూప దర్శనమివ్వనున్న కోటదుర్గమ్మ
- భారీగా తరలిరానున్న భక్తులు
- పాలకొండలో నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు : డీఎస్పీ రాంబాబు


కోటదుర్గమ్మ ఉత్సవ విగ్రహం


నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్న కోటదుర్గమ్మ ఆలయం

పాలకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా దసరా సందడి మొదలైంది. సోమవారం నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లావాసులు సన్నద్ధమవుతున్నారు. ప్రముఖ అమ్మవారి ఆలయాలను సైతం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. శంబర పోలామంబ దేవాలయంలో ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేశారు. ఇక పాలకొండ కోట దుర్గమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. దసరా వేడుకలను అత్యంత వైభవంగా జరిపేందుకు అందరూ సహకరించాలన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. 'అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు జరుగుతాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నాం. 21వ తేదీ సాయంత్రం నుంచి అక్టోబరు 3వ తేదీ సాయంత్రం వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది. నిజరూప దర్శనం నుంచి విజయ దశమి తిరువీధి పూర్తయ్యేంతవరకు రోజూ బందోబస్తు కొన సాగుతుంది. పోలీసుల నిఘా ఉంటుంది. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సీసీ, డ్రోన్ కెమెరాలు


మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

ఏర్పాటు చేస్తున్నాం.' అని తెలిపారు.

భారీ వాహనాల మళ్లింపు ఇలా..

' ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే భారీ వాహనాలు పార్వతీపురం మీదుగా పాలకొండ కార్గిల్ జంక్షన్ వైపు నుంచి రాజాం, చిలకపాలెం మీదుగా మళ్లిస్తాం. శ్రీకాకుళం నుంచి రాయగడ వైపు వెళ్లే వాటిని చిలకపాలెం రాజాం, రామభద్రపురం, పార్వతీపురం మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. శ్రీకాకుళం నుంచి కొత్తూరు, సీతంపేట వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలు పాతపట్నం, కొత్తూరు వైపుగా మళ్లిస్తాం. రాయగడ నుంచి కొత్తూరు వెళ్లాల్సిన వాటిని కురుపాం, ఎల్విన్‌పేట, బత్తిలి వైపు , విజయనగరం నుంచి బత్తిలి, కొత్తూరు వెళ్లాల్సిన భారీ వాహనాలను పార్వతీపురం, కురుపాం, ఎల్విన్‌పేట మీదుగా మళ్లిస్తాం.' అని డీఎస్పీ వెల్లడించారు.

పాలకొండ టౌన్‌లో...

'రాజాం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఫోర్‌వీలర్స్, ద్విచక్ర వాహనాలు అన్నవరం జంక్షన్, అన్నవరం గ్రామం, వడమ, వడమ జంక్షన్ మీదుగా మళ్లిస్తాం. వీరఘట్టం వైపు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వచ్చే వాహనాలు కార్గిల్ జంక్షన్ వద్ద నుంచి అన్నవరం జంక్షన్, అన్నవరం గ్రామం వడమ జంక్షన్ మీదుగా రాకపోకలు

(మిగతా 8వ పేజీలో...)

శంబరలో ఏర్పాట్లు పూర్తి

మక్కువ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ దేవాలయంలో ఈ నెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయం కార్య నిర్వాహణాధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు , విశేష హోమాలు చేస్తామని తెలిపారు. ప్రత్యేక అలంకరణలో పోలమాంబ దర్శనమివ్వనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.


శంబర పోలమాంబ

బడులకు సెలవులు

- వచ్చేనెల 3న పునః ప్రారంభం
- స్వగ్రామాలకు ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులు
- బస్సులు కిటకిట

సాలూరు రూరల్/ పాచిపెంట/ సీతంపేట రూరల్/ గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్టు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయ రామరాజు శనివారం ఆదేశాలు జారీ చేశారు. 21వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందే బడులకు సెలవులు ఇచ్చినట్టయ్యింది. విద్యా క్యాలండర్ ప్రకారం ఈనెల 24 నుంచి దసరా సెలవులు ఇవ్వాల్సి ఉంది. కానీ 22 నుంచే శరన్నవరాత్రులు ప్రారంభమవుతున్నందున ఆ రోజు నుంచే సెలవులు ఇస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 1,758 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ సెలవులు పాటించాల్సి ఉంది. వచ్చే నెల 3న బడులు పునః ప్రారంభం కానున్నాయి. మరోవైపు బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు శనివారం సాయంత్రం నుంచే తమ స్వగ్రామాలకు

(మిగతా 8వ పేజీలో...)


భామిని: బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న విద్యార్థులు


గుమ్మలక్ష్మీపురం : బస్సుల కోసం తల్లిదండ్రులతో కలిసి భద్రగిరి గురుకుల పాఠశాల బయట వేచి ఉన్న విద్యార్థులు

పెరుగుతున్న అదృశ్యం కేసులు

- మహిళలు, బాలికలే అధికం



రాజాం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 105 వరకూ అదృశ్య కేసులు నమోదయ్యాయి. కొందరి ఆచూకీని నేటికీ పోలీసులు గుర్తించలేకపోయారు. చిన్నచిన్న కుటుంబ కలహాలు, మనస్పర్థలతోనే ఎక్కువ మంది ఇళ్ల నుంచి బయటకు వెళ్తున్నారు. ప్రేమ, ఒత్తిడి, వివాహేతర సంబంధాలు, వేధింపులు, చదువులో రాణించకపోవడం తదితర కారణాలతోనూ అదృశ్యమవుతున్నారు. వీరిలో బాలికలు, మహిళలు అధికంగా ఉన్నారు. సోషల్ మీడియా బాధితులు సైతం అదృశ్యమవుతున్నారు. 2024-25 ఏడాదిలో ఏకంగా 252 కేసులు నమోదయ్యాయి. వీటిలో మహిళలు 114 మంది ఉన్నారు. బాలికలు 44 మంది, బాలురు 11 మంది, పురుషులు 83 మంది ఉన్నారు. 2025-26లో ఇప్పటివరకూ ఎనిమిది నెలల్లో 105 మంది అదృశ్యమైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో మహిళలు 44 మంది అదృశ్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. బాలికలు 24 మంది, పురుషులు 30 మంది, బాలురు ఏడుగురు మిస్ అయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. 'మానసిక స్థితి బట్టి కొంతవరకు ముందే గుర్తించవచ్చు. ముభావంగా ఉండి, ఎవరితో మాట్లాడేందుకు ఇష్టపడడం లేదంటే అనుమానించాల్సిన విషయమే. వెంటనే కుటుంబ సభ్యులు వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.' అని మానసిక వైద్య నిపుణుడు తిరుపతిరావు తెలిపారు.

రేపటి వరకు ఆగుదాం




- కొత్త వాహనాల కొనుగోలు కోసం వేచి ఉన్న వినియోగదారులు
- అమలులోకి జీఎస్టీ తగ్గింపులు

6లో

ఆదుకోరూ!

- చంద్రన్న బీమా కోసం బాధితుల ఎదురుచూపు
- సక్రమంగా చెల్లించని గత వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వం స్పందించాలని విన్నపం





జియ్యమ్మవలస, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాలపై గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బీమా సొమ్ము చెల్లించకుండా మోసం చేసింది. దీంతో కుటుంబ యజమాని లేక.. ప్రభుత్వ ఆర్థిక సాయం అందక బాధిత కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. ప్రస్తుతం వారంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. వాస్తవంగా కుటుంబంలో ఎవరు చనిపోయినా గత టీడీపీ ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం వర్తింపజేసేది. బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. వైఎస్ఆర్ బీమా పేరుగా మార్చి.. బీమా సొమ్ము తగ్గించింది. ఇంటి పెద్ద చనిపోతేనే బీమా వర్తింపజేసేవారు. అయితే ఆ సొమ్ము కూడా వైసీపీ సర్కారు చివరి ఏడాదిన్నర కాలంలో బాధితుల ఖాతాలకు జమ చేయలేదు.

గత టీడీపీ ప్రభుత్వంలో..

గత టీడీపీ ప్రభుత్వం 2014లో సెర్ప్ ద్వారా చంద్రన్న బీమా పథకం అమలు చేసింది. బీమా మిత్రల ద్వారా మరణించిన కుటుంబాలకు తగు ఆర్థిక సహాయం అందించేది. వ్యక్తి మరణిస్తే అతని వివరాలు రెండు గంటల్లోనే బీమా మిత్రలు నమోదు చేసి ఆరు గంటల్లోపే తక్షణ సహాయం కింద రూ. 5 వేలు అందజేసేవారు. ఆ తరువాత పూర్తి వివరాలు రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో పొందుపరిచి నెల రోజుల్లోపే బీమా మొత్తం సొమ్ము బాధిత కుటుంబానికి అందించేవారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షలు, సహజ మరణం అయితే రూ. 2 లక్షలు బాధిత

(మిగతా 8వ పేజీలో...)

ప్రతి సచివాలయం పరిధిలో
పరిశ్రమ ఉండాలి

- అధికారులకు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

పార్వతీపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి సచివాలయం పరిధిలో ఒక పరిశ్రమ నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పరిశ్రమలశాఖ అధికారులతో సమీక్షించారు. ప్రతి గ్రామం నుంచి ఒక పారిశ్రామికవేత్త వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఈ ఏడాది 2,100 యూనిట్లు నెలకొల్పాలని సూచించారు. ఇందుకోసం సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులను వినియోగించుకోవాలన్నారు. ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ పార్క్‌లు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. ప్రతి మండలంలో ప్రస్తుతం ఉన్న పరిశ్రమలతో పాటు అనుకూల, మూతపడిన వాటి వివరాలు సేకరించాలన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు అవకాశాలను అన్వేషించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ మొక్కలు నాటారు. ఆయన వెంట జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో హేమలత తదితరులు ఉన్నారు.

పర్యాటక ప్రదేశాలపై రీల్స్

జిల్లాలో చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలు, జలపాతాలపై 60 సెకెండ్ల నిడివితో రీల్స్ చేసి ఈ నెల 30లోగా మన్యం.పబ్లిసిటీ.జీమెయిల్.కామ్‌కు పంపాలని కలెక్టర్ సూచించారు. వాటిల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి.. విజేతలకు దసరా ఉత్సవాల సందర్భంగా

(మిగతా 8వ పేజీలో...)


కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

అందమైన బంధానికి ఓ ప్రశంస

- నేడు భార్యను ప్రశంసించే రోజు

6లో

మతిమరుపు.. మహా ప్రమాదం

- నేడు ప్రపంచ అల్జీమర్స్ డే

6లో

అబద్ధపు ప్రచారంతో జగన్ మోసం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి


జంఝావతి నుంచి నీరందించాలి

- సీఎం చంద్రబాబును కోరిన ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

8లో


గురజాడ.. ఎప్పటికీ అడుగుజాడ

- నేడు మహాకవి జయంతి



విజయనగరం/ బొబ్బిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):నవయుగ వైతాళికుడు, మహాకవి గురజాడ అప్పారావు కలం నుంచి జాలువారిన ఎన్నో రచనలు సమాజాన్ని తట్టిలేపాయి. మిగతా రచయితలకు ఆదర్శప్రాయంగా నిలిచాయి. కన్యాశుల్కమనే సాంఘిక నాటకం నేటికీ దేశంలో ఏదో ఒక ప్రాంతంలో ప్రదర్శితమవుతూనే ఉంది. మహాకవి గురజాడ 1862 సెప్టెంబరు 21న విశాఖ జిల్లా సర్వసిద్ధి రాయవరంలో జన్మించారు. మహారాజా పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా, కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసిన గురజాడ విజయనగరం సంస్థానంలో శాసన పరిశోధకుడి వృత్తిలోకి ప్రవేశించారు. అప్పట్లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో బాల్య వివాహాలు అధికంగా జరిగేవి. ఈ పద్ధతి మారాలని సంకల్పించి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అనాడు గురజాడ రాసిన రచనే కన్యాశుల్కం. ఈ నాటకాన్ని తొలిసారి పెద్ద చెరువు గట్టుపై ప్రదర్శించారు. ఇందులో పాత్రలు ఇప్పటికీ మనకళ్ల ముందు కదలాడుతూనే ఉంటాయి. కాగా గురజాడ జయంతి వేడుకలను ఆదివారం దేశమంతా జరుపుకోనున్నారు.

మతిమరుపు.. మహా ప్రమాదం



● 60 ఏళ్లు దాటితే తస్మాత్ జాగ్రత్త ● వ్యాధి ముదిరితే ఇక మంచంపైనే... ● నేడు ప్రపంచ అల్జీమర్స్ డే

● విజయనగరానికి చెందిన రామారావు ఈ మధ్యనే ప్రభుత్వం ఉద్యోగిగా పదవీ విరమణ చేశారు. ఇటీవల జరిగిన సంఘటనలను ఆయన మరచిపోతున్నారు. తన కారు తాళాలు ఎక్కడ పెట్టాడో గుర్తు చేసుకోలేక పోవడం... భోజనం గురించి మరిచిపోవడం, ఇతరులతో మాట్లాడేటప్పుడు సరైన పదాలను గుర్తు చేసుకోలేక ఇబ్బంది పడడంతో కుటుంబ సభ్యులు వైద్యులకు చూపించారు. ఆయనకు అల్జీమర్స్ లక్షణాలు ఉన్నాయన్నారు.

● ముఖేష్‌కి 70 ఏళ్లు. తన పర్సు ఫ్రిజ్‌లో పెట్టాడు. తరువాత చాలా సేపు వెతికాడు. చివరికి అతని భార్య పర్సును గుర్తించడంతో ఊపిరి పీల్చు కున్నాడు. ఆ తరువాత షాపింగ్‌నకు వెళ్లినప్పుడు వస్తువుల జాబితాను మరిచిపోవడం... తన సొంత కొడుకు, కూతుళ్ల పేర్లు గుర్తుకు రాకపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. దీంతో వైద్యుల దగ్గరకు తీసుకెళితే.. అల్జీమర్స్‌గా ధ్రువీకరించారు.



విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి)

...ఇలా వయస్సు పైబడిన వారిలో కనిపించే సమస్యే అల్జీమర్స్. దీని బారిన పడిన వారిలో జ్ఞాపకశక్తి లోపించడం వల్ల వారి దైనందిన కార్యక్రమాలు కూడా చేసుకోలేక ఇబ్బందుల్లో పడతారు. అంతకుముందు జరిగిన విషయాలు గుర్తుకురాకపోవడం... ముఖ్యమైన తేదీలు, సమాచారం మరిచిపోవడం అల్జీమర్స్ లక్షణాలు. ఎందుకంటే మెదడులో మొదటి భాగాల్లో హిప్పోకాంపస్ దెబ్బతింటుంది. జ్ఞాపకశక్తిలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. మామూలుగా ఎవరూ తన జీవితంలో జరిగిన చాలా విషయాలను మరిచిపోరు. ఎన్నాళ్లయినా ఆ జ్ఞాపకాలు చెరిగిపోవడం అంటూ ఉండదు. కానీ అల్జీమర్స్ వ్యాధికి గురైతే మాత్రం జ్ఞాపకాలు చెరిగిపోయే ప్రమాదం ఉంటుంది. ఆలోచనల్లో మార్పుల కారణంగా చాలా వరకూ ఇబ్బందులు కలుగుతాయి. సొంతవారినే గుర్తు పట్టలేకపోవడం... మాటల తడబాటు, ప్రతి విషయాన్ని ఆలోచించే విధానంలో నెమ్మదితనం... మాటల్లో చెప్పాలనుకునే విషయాలకు సంబంధించి పదాలు వెతుక్కోవడం వంటివి ఉంటాయి.

● ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 50 మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని అంచనా. ప్రతి మూడు సెకన్లకు ఒక కొత్త అల్జీమర్స్ కేసు నమోదవుతోంది. భారతదేశంలో ఈ సంఖ్య నాలుగు మిలియన్లకు పైగా ఉంది. ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో 65 శాతం మంది మహిళలే ఉన్నారని చెబుతున్నారు.

చికిత్స.. నియంత్రణ ఇలా..

అల్జీమర్స్‌కు పూర్తిగా చికిత్స లేదు. కానీ వ్యాధి పురోగతిని తగ్గించే ఔషధాలు ఉన్నాయి. మెదడుకి వ్యాయామాలు అనగా చదవడం, పజిల్స్, సూడోకు వంటివి చేయాలి. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలి. శారీరక వ్యాయామం, సమతుల ఆహారం, పండ్లు, కూరగాయలు, గింజలు, ఓమెగా-3, ఫ్యాటీ యాసిడ్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా అల్జీమర్స్ వ్యాధిని కొంత వరకూ నివారించవచ్చును.

ఏ వయసులో వస్తుందంటే..

● సాధారణంగా 65 పైబడిన వారిలో ఈ వ్యాధి అధికంగా వస్తుంది. అయితే అరుదుగా 40 నుంచి 50 ఏళ్ల వయస్సు వారిలోనూ ఈ లక్షణాలు కనిపిస్తాయి.
● కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే.. తరువాతి తరంలో వారికి వచ్చే అవకాశం ఉంది.
● మెదడులోని రసాయన మార్పులు, న్యూరో ట్రాన్స్‌మీటర్ల అసమతుల్యత వల్ల అధిక రక్తపోటు, మధుమేహం, ధూమపానం, మద్యపానం వంటి వాటి వల్ల దీని బారిన పడతారు.
● మానసిక ఒత్తిడి, ఒంటరితనం కూడా దీనికి కారణమవుతాయి.

నిర్లక్ష్యం చేయకూడదు..



అల్జీమర్స్ వృద్ధాప్యం వల్ల వచ్చే సమస్య మాత్రమే కాదు. దీనికి కొన్ని జన్యుపరమైన కారణాలు కూడా ఉండవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలితో ఈ వ్యాధిని కొంతవరకూ నివారించవచ్చు. ఎవరైనా చిన్న మతిమరుపును కూడా నిర్లక్ష్యం చేయకూడదు. తొందరగా గుర్తిస్తే రోగి జీవితం చికిత్సతో సులభంగా సాగుతుంది. కుటుంబ సభ్యుల సహకారం రోగికి అత్యంత అవసరం. ముఖ్యంగా పజిల్స్ మెదుడుకు పదును పెట్టే ఆటలు ఆడడం వల్ల చురుకుగా ఉండొచ్చు. ఎవరికైనా మతిమరుపు వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకూండా వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకోవాలి. లేదా అల్జీమర్స్ ముదిరి జీవితం దుర్లభయ్యే అవకాశం ఉంది.

-డాక్టర్ హేమంత్ మాధవ్, సైకియాట్రిస్ట్, విజయనగరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ టి.మాధవీదేవి తదితరులు

ఘనంగా 'రామాయణ శంఖారావం'

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణం ప్రాంగణంలో శనివారం 'రామాయణ శంఖారావం 'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం జాతీయ స్థాయి లీగల్ కాంక్లేవ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాన్ని తెలంగాణ హైకోర్టు జస్టిస్ టి.మాధవీదేవి, జస్టిస్ సూర్యపల్లి నందా, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ డి.సూర్యప్రకాష్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా వేద పాఠశాల విద్యార్థులు వేదపఠనం చేశారు. రామాయణంలోని నైతిక విలువలు, న్యాయం, సమానత్వం, మానవ గౌరవం, నైతికత వంటివి భారత రాజ్యాంగ మూలసూత్రాలతో ఎలా కలుస్తాయో ఈ సదస్సులో చర్చించారు. రామాయణ దృక్పథం, కథనాలు, న్యాయవిద్య, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, శాసన నైతికతలను ఎలా సమృద్ధి పరుస్తారనే విషయమై చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఎం.వెంకటేశ్వరి, సుప్రీం కోర్టు న్యాయవాది నిహారికారెడ్డి, సైబర్ లా స్పెషలిస్ట్ డాక్టర్ సాయి సుశాంత్ సముద్రాల, ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టీ నారాయణం నాగేశ్వరరావు, ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, వాల్మీకి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఎస్.లజపతిరాయ్, కో-ఆర్డినేటర్ గౌరీ నిత్య, తవాస్మీ అకాడమీ ప్రతినిధి శ్రీరామ చక్రధర్, డైరెక్టర్ శారదాదీప్తి, జాహ్నవి రెడ్డి పాల్గొన్నారు.



రేపటి వరకు ఆగుదాం

● కొత్త వాహనాల కొనుగోలు కోసం వేచి ఉన్న వినియోగదారులు
● అమలులోకి జీఎస్టీ తగ్గింపు
● దసరాకు అమ్మకాలు పెరిగే అవకాశం

సాలూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వివిధ వస్తువులు... వాహనాలపై జీఎస్టీ తగ్గింపులు సోమవారం నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాల కొనుగోలుకు ప్రజలు కూడా వేచి చూస్తున్నారు. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో బైక్‌లు, కార్ల విక్రయాలు ప్రస్తుతానికి నిలిచి పోయాయి. 350 సీసీలోపు బైక్‌లు, వివిధ రకాల కార్లపై జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం 28 నుంచి 18 శాతానికి తగ్గించింది. దీంతో వాటి ధరలు తగ్గనున్నాయి. దసరా, దీపావళి కానుకగా దేశ ప్రజలకు అందించాలనే దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యే ఈ నెల 22 నుంచి జీఎస్టీ తగ్గింపును అమల్లోకి తీసుకొస్తోంది. దీంతో బైక్‌లకు దాని మోడల్, కంపెనీ బట్టి రూ.6 వేల నుంచి 21 వేల వరకు, కార్లకు రూ. 50 వేల నుంచి రూ.3 లక్షల వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో బైక్ లేదా కారు కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు ఈ నెల 22 తరువాత చూద్దామనే ధోరణిలో ఉన్నారు. దసరాకు వాహనం కొనుగోలుకు ముందస్తుగా అడ్వాన్స్‌లు ఇచ్చి... బుక్ చేసుకోవడానికి సైతం ముందుకు రావడం లేదు. దీంతో కొద్ది రోజులుగా కోట్లాది రూపాయల టర్నోవర్ నిలిచి పోయింది. జీఎస్టీ సవరణలు ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క బైక్ కూడా విక్రయించలేక పోయామని సాలూరులో ఓ కంపెనీ బైక్‌ల విక్రయదారు సత్యనారాయణ అన్నారు. ఇదిలా ఉండ గా 350 సీసీ దాటిన రాయల్ ఎన్‌ఫీల్డ్ తదితర బైక్‌ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. 650 సీసీ ఎన్‌ఫీల్డ్ ధరలు ఈ నెల 22 తరువాత పెరగనున్నాయి.

నేడు ధరల పట్టికల రాక..

జీఎస్టీ సవరణల నేపథ్యంలో ఈ నెల 22 నుంచి ఏ ధరలకు బైక్‌లు, కార్లు విక్రయించాలనే ధరల పట్టికలు షోరూంలకు ఈ నెల 21న రానున్నాయి. దీనిని బట్టి ఏ మోడల్‌కు ఏ మేరకు ధర తగ్గిందో, 350 సీసీ దాటితే ఏ మేరకు ధర పెరిగిందో వచ్చే ధరల పట్టికన విక్రయాలు ఉంటాయి. ధరల పట్టిక కోసం ప్రతి రోజు వినియోగదారులు వాకబు చేస్తున్నారని విక్రయదారులు చెప్పారు. దసరాకు బైక్‌లు, కార్ల విక్రయాలు అధికంగా ఉండే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



అందమైన బంధానికి ఓ ప్రశంస

● నేడు భార్యను ప్రశంసించే రోజు

రాజాం/బొబ్బిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి)

● నేను ఒక సాధారణ ఉద్యోగిని. ఆర్డీవో స్థాయిలో పదవీ విరమణ చేశాను. కానీ నా కుటుంబంతో పాటు బంధువులను సమన్వయం చేసుకోవడంలో నా భార్య ఎంతో కీలకంగా వ్యవహరించేవారు. విధుల్లో నేను కష్టపడవచ్చు. కానీ కుటుంబపరంగా ఎప్పుడూ కష్టం ఆమెది. అందుకే కుటుంబంలో క్లిష్ట పరిస్థితులు వచ్చిన ప్రతిసారి నా భార్యను 'నా ఇంటి మహాలక్ష్మి' అంటూ ప్రశంసిస్తుంటాను. ఆ సమయంలో నేను మనస్ఫూర్తిగానే ఆ మాట చెబుతాను.

-పాలకొండ ఆర్డీవోగా ఉద్యోగ విరమణ చేసిన పీఎంజేబాబు

● నేను సాధారణ ఉద్యోగిగా ఉంటూ ఈ స్థాయికి వచ్చాను. ఉద్యోగి అంటేనే బదిలీలు సహజం. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రీజియన్ బదిలీలు ఉంటాయి. ఆ సమయంలో కుటుంబాన్ని వదిలిపెట్టాలి. అలాంటి సమయంలో పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ బాధ్యతలు నా భార్య చూసుకునేది. ఆ సమయంలో ఇంటి పనులతో పాటు కుటుంబాన్ని సమన్వయం చేసుకోవడం చాలా కష్టం. ఆ సమయంలో మాత్రం భార్యే సర్వస్వం అని అనిపిస్తుంది. 'నీలాంటి మనిషి నాకు తోడుగా దొరకడం ఆనందంగా ఉంటుంది' అని నా భార్యకు చెబుతుంటాను.

-ఎం.రాజశేఖర్, రాజాం తహసీల్దారు

భార్య.. కుటుంబంలో అతి పెద్ద పాత్ర ఆమెది. సంపాదించేది భర్తే అయినా.. కుటుంబాన్ని సమన్వయం చేసేది భార్య. కుటుంబ జీవనం సవ్యంగా సాగడం భార్య నడవడిక పైనే ఆధారపడి ఉంటుంది. ఎక్కువ మంది ఉద్యోగులు... అధికారులు... నేతలు విధి నిర్వహణలో స్వేచ్ఛగా వ్యవహరిస్తుంటారంటే.. దాని వెనుక కుటుంబ బాధ్యతలు మోసే భార్య పాత్ర కీలకం. భార్యలు ఏదీ ఆశించరు కానీ.. భర్తల నుంచి వచ్చే ప్రశంసలను మధురానుభూతిగా భావిస్తుంటారు.

● ఆమె పాత్ర కీలకం...

కాలంతో పాటు సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా.. కుటుంబంలో మాత్రం 'ఆమె' పాత్ర మాత్రం మరువరానిది. భార్య... ఇంట్లో తల్లిగా.. కోడలిగా.. అత్తగా... అమ్మమ్మగా... నాన్నమ్మగా... ఇలా బహు పాత్రలు పోషించి...అలసిపోతుంటుంది. ఈ పాత్రలను సమర్థంగా పోషించే క్రమంలో భర్త నుంచి వచ్చే చిన్న ప్రశంస చాలు... మొత్తం అలసట నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు... కుటుంబ నావను సవ్య దిశగా నడిపేందుకు ప్రశంస ఇంధనంగానూ ఉపయోగపడుతుంది.

● గొప్ప అనుభూతి..

భార్యను ప్రశంసించడం అనేది కూడా ఒక ప్రత్యేక విద్య అంటారు పురుష శిఖామణులు. కేవలం భార్యను ప్రశంసించడమే కాదు. వారి బలహీనతలను... సమస్యలను గుర్తెరగాలి. వాటికి పరిష్కారం చూపాలే కానీ...వారిపై చిరాకు పడకూడదు. వారిని విమర్శించి... దూషించకూడదు. మనస్తాపానికి గురయ్యేలా చేయకూడదు. ఎలా ఉన్నా ప్రేమించడం మాత్రం మానకూడదు. వారెలా ఉన్నారో అలానే స్వీకరించాలి. నువ్వు నాకు నచ్చినట్టు ఉంటేనే ప్రేమిస్తా.. లేకుంటే మాత్రం లేదు అనేలా వ్యవహరించకూడదు. అలా వ్యవహరిస్తే.. ఆ బంధం ఎక్కువ కాలం నిలవదు కూడా.

● అవమానించకూడదు..

జీవిత భాగస్వామిని అనుమానిస్తే అవమానించినట్టే. ఆ అనుమానమే బంధాన్ని బలహీనపరుస్తుంది. భార్య స్వేచ్ఛకు ఎట్టి పరిస్థితుల్లో భంగం కలిగించకూడదు. చిన్నచిన్న విషయాల్లోనూ ప్రవేశించి.. అడగకుండానే సలహా ఇవ్వడం... సరైన రీతిలో ఆలోచించడం లేదని విమర్శించడం... తనకంటే తక్కువగా భావించడం, వంటివి బంధాలను దెబ్బతీస్తాయి. భాగస్వామికి భావస్వేచ్ఛ ఇవ్వడం చాలా ఉత్తమం.

● అర్థం చేసుకోవాలి..

భార్యాభర్తలు ఒకరిని ఒకరు అర్థం చేసుకోవాలి. కుటుంబ బాధ్యతలు చూసుకునే భార్యకు భర్త ప్రశంస కొండంత అండగా ఉంటుంది. మనసుకు సాంత్వన ఇస్తుంది. అందుకే భార్య మనసును గుర్తెరగాలి. ఆమె మనసు తెలుసుకొని ప్రవర్తించాలి. ఏమైనా సమస్యలు ఉంటే జఠిలం చేయకుండా జాగ్రత్తగా పరిష్కరించుకోవాలి.

-శంకరావు, న్యాయవాది, రాజాం

ఆమె సేవలు మరచిపోలేనివి..



నా భార్య రోజా ఆతిథ్యం అందివ్వడంలో ఎంతో ప్రత్యేకతను చాటుకుంటోంది. 22 సంవత్సరాలుగా మేము అన్యోన్యమైన దంపతులుగా ఉండడానికి ఆమె చేస్తున్న సేవలే ప్రధానమైన కారణం. ఆమె అతిథులకు, బంధువులు, స్నేహితులకు ఇచ్చే ఆతిథ్యం మంత్రముగ్ధులను చేస్తుంది. పర్వదినాలు, ఇతరత్రా ముఖ్యమైన కార్యక్రమాలలో రోజా స్వయంగా తయారు చేసి అలంకరించే వెజిటబుల్ కార్వింగ్, ఫుడ్ కార్వింగ్‌లు అతిథులందరినీ విశేషంగా ఆకట్టుకుంటాయి. వీటిని ఆమె స్వయంకృషితో నేర్చుకుంది. వీటిని ప్రదర్శించినప్పుడు, ఆమె ఇచ్చిన విందు భోజనాలను ఆరగించినప్పుడు ఎంతోమంది ముఖ్య అధికారులు, వారి కుటుంబ సభ్యులు, మా సమీప బంధువులు, హితులు, సన్నిహితులు నా భార్యను ప్రశంసిస్తుంటారు. కర్తవ్య నిర్వహణలో నిత్యమూ బిజీగా, ఒత్తిడితో ఉండే నా జీవన శైలికి నా భార్య నా పట్ల చూపే శ్రద్ధ దివ్యౌషధంగా పని చేస్తుంటుంది. నా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో ఆమెను కృతజ్ఞతా పూర్వకంగా ప్రశంసిస్తూ ఉంటాను.

-కటకం సతీష్‌కుమార్, సీఐ, బొబ్బిలి

రాజకీయాలలో చేదోడుగా నిలుస్తోంది..



నేను రాజకీయాలలో చాలా బిజీగా ఉంటూ సమయానికి ఇంటికి చేరలేక పోయినప్పటికీ నా భార్య స్వప్న ఎంతో బాధ్యతగా ఇంటిని చక్కదిద్దుకుం టుంది. రాజకీయాలలో కూడా చేదో డువాదోడుగా నిలుస్తుంది. క్లిష్టమైన సమస్యలు వచ్చినప్పుడు అమూల్యమైన సలహాలు, సూచనలు ఇస్తుంటుంది. నేను గతంలో తీవ్రమైన అస్వస్థతకు గురై... నాకు శస్త్ర చికిత్స జరిగినప్పుడు ఆమె ఆసుపత్రిలో రాత్రింబవళ్లు ఎంతో ఓర్పు, సహనం, ప్రేమతో సేవలు చేసింది. ఆమెను ప్రశంసించకుండా ఉండలేక పోయాను. వార్డులో ప్రజలందరితో స్నేహపూర్వకంగా మెలుగుతుంటుంది. నా ఇష్టాలు ఏమిటో తెలుసుకుని మరీ వాటిని సమకూర్చి పెడుతుంటుంది. అందుకే ఆమెను ప్రశంసిస్తుంటాను.

-రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ చైర్మన్, బొబ్బిలి

శివాలయాలలో ప్రత్యేక పూజలు



108 శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

కొత్తవలస, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని వివిధ శివాలయాలలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తుమ్మికాపల్లి రైల్వేగేట్ సమీపంలోనున్న ఓంసదనంలో 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వాహకుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ నిర్వహించారు. రామలింగపురం గ్రామంలోనున్న శ్రీ ఉమా రామలింగేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకుడు సాయి సత్యనారాయణ శివలింగానికి ప్రత్యేకంగా జలాభిషేకాన్ని, పాలాభిషేకాన్ని చేశారు. ఆలయంలో ఉన్న వినాయకుడు, నంది, పార్వతీదేవి విగ్రహాలకు అభిషేకాలు చేశారు. కొత్తవలసలోని పంచాయతన రామలింగేశ్వర ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యభరత్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

28 నుంచి విజయనగరంలో 'సరస్' ఎగ్జిబిషన్

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28 నుంచి అక్టోబరు 8 వరకూ అఖిల భారత డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన (సరస్ ఎగ్జిబిషన్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు సంబంధించి తన చాంబర్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులోని మాన్సాస్ గ్రౌండ్‌ను ఎగ్జిబిషన్‌కు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ ప్రదర్శనలో మన రాష్ట్రంతో పాటు 18 రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, తినుబండారాలు, దుస్తులు, వివిధ రకాల కలంకారీ వస్తువులు, ఆయుర్వేద ఉత్పత్తులు, గృహోపకరణాలు, మహిళా సంఘాలు సృజనాత్మకతతో సృష్టించిన కళాకృతులను విక్రయానికి ఉంచుతున్నట్లు చెప్పారు. దీని కోసం సుమారు 220 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ఏడాదిలాగే అక్కడ కూడా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బంది పడకుండా తగిన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది కలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డీఈవో మాణిక్యం నాయుడు, డీఎంఅండ్‌హెచ్‌వో జీవనరాణి, ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సులభరీతిలో అభ్యసన ప్రక్రియలు

● ఏఎంవో కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ఏఎంవో కోటేశ్వరరావు

సాలూరు రూరల్/పాచిపెంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అభ్యసన ప్రక్రియలు సులభరీతిలో ఉండాలని... దీని కోసం ఉపాధ్యాయులు వినూత్న పద్ధతులు అవలంబించాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సాలూరు, పాచిపెంట మండలాల్లో ఏఎల్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మధుసూదనరావు, ఐఈఆర్టీ జిల్లా కో ఆర్డినేటర్ భానుప్రకాష్‌లతో కలసి ఆయన పర్యటించారు. సాలూరులో ఎంఈవో కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం పాచిపెంట, పాంచాలి క్లస్టర్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు తదితర విద్యాసామర్థ్యాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యా విభాగంలో జిల్లాకు పేరు తేవడానికి ఉపాధ్యాయులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్, తర్ల్ మెటీరియల్ ఇచ్చినట్టు తెలిపారు. వాటితో బోధన, అభ్యసన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ మధుసూదనరావు మాట్లాడుతూ పాఠశాలకు దీర్ఘకాలంగా గైర్హాజరయ్యే విద్యార్థి వల్ల భవిష్యత్‌లో సమాజానికి సైతం నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు తొలిరోజే స్పందించి కారణం కనుగొంటే బాగుంటుందన్నారు. దీనిపై శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట, పాంచాలి క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్లు బిరుసు ఈశ్వరరావు, వి.ప్రభాకరరావు, ఎంఐఎస్‌లు రమేష్, నరేష్, సీఎంఆర్టీలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత

లక్కవరపుకోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేటకు చెందిన కొట్యాడ కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.38,147 విలువ గల చెక్కును స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు శనివారం అందజేశారు. ఎల్.కోట లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, కె.రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల విడుదల

లక్కవరపుకోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని 31 పంచాయతీలకు 2024-25 సంవత్సరం రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. టైడ్ అన్‌టైడ్ ఫండ్ కింద రూ.85 లక్షల 41వేల 621లు విడుదలయ్యాయని ఈవోఆర్డీ తెలిపారు. అలాగే మండల పరిషత్‌కు రూ.25 లక్షలు విడుదలయ్యాయని చెప్పారు. అత్యధికంగా ఎల్.కోటకు సుమారు రూ.8లక్షలు, చందులూరుకు రూ.5లక్షలు, కల్లేపల్లికి సుమారు రూ.4 లక్షల 28వేలు విడుదలయ్యాయి. ఈ నిధులలో 50 శాతం శానిటేషన్, వాటర్ సప్లైకు ఖర్చు చేయాలన్నారు.

ఎంవీజీఆర్‌లో హ్యాకథాన్ ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్

డెంకాడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవలస వద్ద గల ఎంవీజీఆర్ కళాశాలలో ఇంట్రా-కాలేజ్ 24 గంటల హ్యాకథాన్ సంకల్ప్-2025ను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డా.వైఎంసీ శేఖర్ మాట్లాడుతూ పరిశ్రమ - విద్యా సహకారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో 164 (724 మంది విద్యార్థులు) జట్లు పాల్గొన్నాయి. వడపోత అనంతరం 229 మంది విద్యార్థులతో 51 జట్లు చివరకు 24 గంటల హ్యాకథాన్‌లో పోటీ పడడానికి చివరికి ఎంపికయ్యారు. పాల్గొనేవారు వాస్తవ ప్రపంచ సమస్య ప్రకటనలపై పనిచేస్తారని, ఆవిష్కరణ, జట్టు కృషి, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శిస్తారని, రూ.30వేల నగదు బహుమతిని గెలుచుకునే అవకాశం ఉందని హ్యాకథాన్ కోఆర్డినేటర్ డా.రామ్ సంతోష్‌నాయుడు తెలిపారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వీఆర్ఏలు

గజపతినగరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వీఆర్ఏలు సునీత, పైడి రాజులతో పాటు పలువురు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు తక్షణమే పేస్కేలు అమలు చేయాలని అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా విధులు నిర్వహిస్తున్నవారికి వీఆర్ఏలుగా నియమించాలని అ డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 25న విజయవాడలో ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపారావు, ఆర్.లక్ష్మి, కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అరకొర ఎరువుతో అవస్థలు

రేగిడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉంగరాడ రైతుసేవా కేంద్రం వద్ద శనివారం యూరియా పంపిణీ చేశారు. ఈ కేంద్రానికి మొత్తం 270 యూరియా బస్తాలు వచ్చాయి. అయితే ఈ రైతుసేవా కేంద్రం పరిధిలో ఐదు గ్రామాలు ఉన్నాయి. దీంతో రైతులు యూరియా కోసం పోటీ పడ్డారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

గజపతినగరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొత్త ఓటర్ల నమోదు తోపాటు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని తహసీల్దార్ బి.రత్నకుమార్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికా రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాతో పాటు ప్రస్తుతం ఓటర్ల జాబితాలో ఎంతమంది ఓటర్లు ఉన్నా రు.. మృతిచెందిన వారి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిణి అప్పికొండ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు

కొత్తవలస, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై మొక్కలు అందజేస్తుందని మండల ఉద్యానవన శాఖాధికారిణి పి.పద్మ తెలిపారు. శనివారం చినరావుపల్లి క్లస్టర్‌లో రైతులకు ఆమె ఆయిల్‌పామ్‌పంటపై అవగాహన కల్పించారు. దేశవాళీ ఆయిల్ పామ్ మొక్కలకు హెక్టార్‌కు రూ.20వేలు, విదేశీ మొక్కలకు రూ.29వేలు రాయితీ అందజేస్తారని చెప్పారు.

కుక్కలు బాబోయ్

● భయాందోళనలో ప్రజలు

భోగాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలం లో ఏ గ్రామంలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. తరచూ ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్క కాటుకు గురవుతునే ఉన్నారు. ప్రతి నెలా సుమారు 100 మంది కుక్క కాటుకు గురవుతు న్నారంటే కుక్కలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసు కోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కుక్కలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.


గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

పైడిమాంబ జాతరకు అవసరమైన మౌలిక సదుపాయాలు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పైడిమాంబ జాతరకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు మేయర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక నగరపాలక సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా జీరో అవర్‌లో పలువురు సభ్యులు వివిధ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నగరంలో వైసీపీకి సంబంధించిన ఫ్లెక్సీల అనుమతులను ముందస్తుగా తీసుకున్నా, నిర్ధేశించిన సమయం పూర్తి కాకుండానే వాటిని తొలగించడం పట్ల కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలో పొందుపరిచిన తొమ్మిది అంశాల్లో ఒక అంశం మినహా మిగతావి ఆమోదించారు. అలాగే టేబుల్ అజెండాగా పొందుపరిచిన ఒక అంశానికి సభ్యులు ఆమోదం తెలిపారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ పైడిమాంబ పండుగ నేపథ్యంలో ప్రజలకు, భక్తులకు సౌకర్యవంతమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే నగరంలో రహదారుల పాక్షిక మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. వీధి దీపాల సమస్య లేకుండా సిబ్బందిని ఆదేశించామన్నారు. అన్ని డివిజన్ల అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిల్ కృషి చేస్తున్నదన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కమిషనర్ పి.నల్లనయ్య, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

వకుల్ జిందాల్‌కు ఆత్మీయ వీడ్కోలు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాను ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన 14 నెలల కాలంలో అందరి సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లోనూ రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గుంటూరు జిల్లాకు బదిలీ అయిన ఆయనకు జిల్లా ఏఆర్, పోలీసు అధికారులు, సిబ్బంది శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన ఏఆర్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 14 నెలలుగా అందరి సహకారం సమన్వయంతో గంజాయి మూలాలను సమూలంగా నాశనం చేశామన్నారు. జిల్లాలో పని చేయడం తనకు మధుర స్మృతిగా నిలుస్తుందని, జిల్లా ప్రజలను, అధికారులను, సిబ్బందిని విడిచి వెళ్లడం తనకు చాలా బాధగా ఉందన్నారు. తనకు అందించిన సహకారాన్నే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎఆర్ దామోదర్‌కు అందించాలని కోరారు. అనంతరం ఎస్పీ వకుల్‌జిందాల్‌ను శాలువతో సత్కరించి, సాయుధ పోలీసులు జ్ఞాపికలను బహూకరించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆయన్ని ఎక్కించి.. ఆ వాహనాన్ని లాగుతూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎం.వీరకుమార్, ఆర్ఐలు, సీఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


వకుల్ జిందాల్‌కు గౌరవ వందనంతో వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం ధర్మవరం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పంచాయతీ ఈవో చంద్రశేఖర్, స్థానిక టీడీపీ నేత లగుడు తిరుపతి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, జనసేన నేత సత్యనారాయణ, ఎంపీడీవో సతీష్, న్యాయవాది మండా కామేశ్వరరావు పాల్గొన్నారు.

రాజాంలో ఆర్.నారాయణమూర్తి


మాట్లాడుతున్న నారాయణమూర్తి

రాజాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు, నిర్మాత, నటుడు ఆర్.నారాయణ మూర్తి శనివారం రాజాం పట్టణంలో సందడి చేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొత్త సాయి ప్రశాంత్ కుమార్ సమన్వయంతో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి శ్రీకాకుళం రోడ్డులో కల్కి కల్యాణ మండపంలో ఆయనతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ రాజాం గడ్డ.. పౌరుషాలకు అడ్డా అని పేర్కొన్నారు. తన చిత్రం 'యూనివర్శిటీ పేపర్ లీకేజీను విజయవంతం చేయాలని కోరారు. కల్కి జూయలర్ అధినేత కొత్త మధుసుదనరావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, ఉపాధ్యాయులు ఆర్‌వీజే నాయుడు, లలిత రాణి పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావాలు పెంచుకోవాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పూల్‌బాగ్ కాలనీలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి వచ్చే రహదారి మంజూరు చేయడానికి, మంచి డార్మెటరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు సంవత్సరాలుగా జీతాలు అందని స్కౌట్ సంస్థ ఏఎస్‌వోసీల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంఎల్‌సీని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈపు విజయకుమార్, వాక చిన్నంనాయుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

నెల్లిమర్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, జనసేన పార్టీ నాయకులు శనివారం ఆయన కార్యాల యంలో కలిశారు. నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. పార్టీ నాయకులు బంటుపల్లి వాసుదేవరావు, పతివాడ శ్రీని వాసరావు, రవ్వా నాని, పతివాడ గోవిందరావు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట: నూతన కలెక్టర్ ఎస్.రామ సుందర్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులు విజయనగరం కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించండి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంది సీతారాములు, గోపాల్ తదితరులు ఉన్నారు.


నెల్లిమర్ల: కలెక్టర్‌తో ఎమ్మెల్యే నాగమాధవి

పోరాట ఫలితమే జీఎస్టీ ఉపసంహరణ

రాజాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఏఐఐఈఏ చేసిన పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమాలపై అమలులో ఉన్న 18 శాతం జీఎస్టీని ఉపసంహరించుకుందని ఉత్తరాంధ్ర రాష్ట్రాల ఏఐఐఈఏ మాజీ ఉపాధ్యక్షురాలు ఎస్‌కే గీతా తెలిపారు. శనివారం స్థానిక సూర్యదుర్గా కల్యాణ మండపంలో నిర్వహించిన మహాసభ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఈ విజయం సాధించడానికి ఏఐఐఈఏ యూనియన్ సంఘం 2004 నుంచి పోరాటం చేస్తుందన్నారు. మొదటి సర్వీస్ టాక్స్ అమలైనప్పటి నుంచి దీన్ని వ్యతిరేకిస్తూ 30 లక్షల పాలసీ హోల్డర్ల సంతకాలతో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖను అందించామని చెప్పారు. ఇలా అనేక దఫాలుగా ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లామని ఆమె వివరించారు. ఈ మేరకు జీఎస్టీ తొలగింపునకు సహకరించిన ఎంపీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాక్షులు ఎం.కామేశ్వరి, సూర్యప్రభ, జి.వరప్రసా ద్, రాజాం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రభాకర్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐఐఈఏ మాజీ ఉపాధ్యక్షురాలు గీత

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు?

సంతకవిటి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కారం చేయలేని సమావేశాలు ఎందుకని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజూల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంట పొలాలకు సకాలంలో ఎరువుల అందించి ఆదుకోవాలని గౌరవ సభ్యులు కోరారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా రని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఏవో యశ్వంతరావు మాట్లాడుతూ మండలానికి 1,636 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, దీనిలో రైతు సేవా కేంద్రాలకు 722 టన్నులు, పీఏసీఎస్ 60 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ దుకాణాలకు 389 టన్నులు ఇప్పటివరకు ఇవ్వగా 1171 మెట్రిక్ టన్నులు రైతులకు అందించామ న్నారు. సమావేశంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వైస్ చైర్మన్ సిరిపురపు జగన్, సంతకవిటి మండల ఎంపీపీ సిరిపురపు మంజు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మధు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏఎంసీకి వనరులు సమకూరేలా చర్యలు

గజపతినగరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏఎంసీకి ఆర్థిక వనరులు సమకూరేలా చర్యలు తీసుకుంటామని ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ డైరెక్టర్లతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీకి సంబంధించి చెరకు కాటా వద్ద రూ.కోటి 25లక్షలతో మౌలిక వసతులు కల్పించి వారపు సంత ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టిలో పెట్టామన్నారు. ఆదివారం వారపు సంతలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రేకులషెడ్లు, తాగునీటి సదుపాయం కల్పిస్తామని తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ఏఎంసీ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. అలాగే కార్యాలయానికి సంబంధించి ఉన్న గొడౌన్‌ల మరమ్మతులకు రూ.45లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.18లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు చేపట్టినట్టు తెలిపారు. అలాగే 2 ఎకరాల వీస్తీర్ణంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీకి లీజుకు ఇచ్చేందుకు తీర్మానం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, మార్కెట్ కమిటీ సెక్రటరీ చంద్రమౌళి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కొత్తవలస పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూం

కొత్తవలస, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం డిజిటల్ క్లాస్ రూంను ప్రారంభించారు. శారదా కర్మాగారం, వైజాగ్ నైట్స్ రౌండ్ టేబుల్, వైజాగ్ నైట్స్ నేడీస్ సంస్థలు ఇందుకు నిధులు సమకూర్చాయి. శారదా కర్మాగార డిప్యూటీ ఎండీ నీరజ్ శారదా, హెచ్ఎం సీహెచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐని సస్పెండ్ చేయాలి

● జిందాల్ నిర్వాసితుల ఆందోళన

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట సీఐని సస్పెండ్ జిందాల్ నిర్వాసిత మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బొడ్డవర గ్రామంలో నిరసన చేపట్టారు. ప్రజాసేవ చేయాల్సిన సీఐ.. జిందాల్ సేవలో ఉన్నారని, న్యాయం కోసం పోరాటం చేస్తుంటే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చాలా ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

● ఈ విషయంపై సీఐ నారాయణమూర్తి వివరణ కోరగా.. తాను జిందాల్ నిరసన విషయంపై వీరిని రప్పించలేదని, వీరిపై వేరే ఫిర్యాదులు ఉన్నందున మాట్లాడటానికి పిలిపించామని చెప్పారు. తాము ఎవరినీ వేధించలేదని తెలిపారు.

నిరసనలో మహిళకు అస్వస్థత

జిందాల్ నిర్వాసితులు బొడ్డవర గ్రామంలో శనివారం నిరసన చేస్తుండగా అమ్మపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ శిరగం లక్ష్మి అకస్మాత్తుగా అస్వస్థతకు గురైంది. దీంతో ఈమెను వెంటనే ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి, విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. తమకు వెంటనే ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ నిర్వాసిత కుటుంబం కోరింది.



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసిత మహిళలు

పోలీసుల తీరు దారుణం

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చాలా దారుణంగా ఉందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం బొడ్డవర గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు జిందాల్ నిర్వాసితులను అనుక్షణం ఇబ్బందులు పెడుతున్నారని.. ఎవరి ఒత్తిడితో ఇవి చేస్తున్నారో చెప్పాలన్నారు. ప్రతిరోజూ సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్స్ పోన్లు చేసి నిర్వాసితులను స్టేషన్‌కు రప్పించి వారి ఆత్మ గౌరవం దెబ్బతీసేలా చులకనగా మాట్లాడటం.. పరుష పదజాలం ఉపయోగించడంతో నిర్వాసితులు మానసికంగా కుమిలిపోతున్నారన్నారు. పోలీసులు తీరు ఇలాగే ఉంటే న్యాయ పోరాటం చేస్తామన్నారు. రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం ద్వారా త్వరలో ఈ ప్రాంత జిందాల్ రైతులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగిందన్నారు. కమిషన్ మెంబర్లు ఈ ప్రాంతంలో పర్యటించి గ్రామసభల ద్వారా నిర్వాసితుల గోడు వింటామని చెప్పడం సంతోషం కలిగించిందన్నారు.

ఒట్టిగెడ్డలో మృతదేహం

వీరఘట్టం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం సమీపంలో గల ఒట్టిగెడ్డలో శనివారం మధ్యాహ్నం మృతదేహం లభ్యం కావడంతో కలకలం రేగింది. దీంతో పెద్ద ఎత్తున ప్రజలు అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్ఐ జి.కళాధర్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నడుకూరు గ్రామానికి చెందిన గేదెల శ్రీనివాసరావు(40) శుక్రవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు గెడ్డలో పడి చనిపోయాడని ఆయన కుమారుడు దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కుంటినవలస హెచ్‌ఎం సస్పెన్షన్

మెంటాడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటినవలస జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్ఎం రామకృష్ణ మద్యం తాగి విధులకు హాజరవుతున్నారని, ఈయనపై ఇంకా పలు ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ విద్యా కమిటీ చైర్మన్ సత్యనారాయణ ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో డిప్యూటీ డీఈవో మోహనరావు ఈనెల 18న విచారణ నిర్వహించారు. విచారణ సమయంలోనే హెచ్ఎం రామకృష్ణ సహ ఉపాధ్యాయుడు సూర్యారావుపై చేయిచేసుకున్నారు. విచారణ నివేదికను డిప్యూటీ డీఈవో మోహనరావు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈక్రమంలో రామకృష్ణను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇదే హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు గిరి కూడా మద్యం తాగి, విధులకు హాజరవుతున్నట్టు తేలడంతో ఆయన్ని ఇప్పటికే సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఒకే హైస్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు ఒకేసారి సస్పెండ్ అవడం ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం రేపుతోంది.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

పాచిపెంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పి.కోనవలస ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనానికి కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పి.కోనవలస ఘాట్ రోడ్డులో శనివారం సుంకి వైపు నుంచి ఓ కారు వస్తోంది. అదే సమయంలో నల్లమిల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి సాలూరు నుంచి సుంకి వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా, ఆ కారు ఢీకొంది. దీంతో శ్రీనివాస్ కుడి కాలికి గాయాలయ్యాయి. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కారుడ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

మరుపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

గజపతినగరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మరుపల్లిలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావుపై శనివారం విచారణ చేపట్టినట్టు బొబ్బిలి డిప్యూటీ డీఈవో కె.మోహనరావు తెలిపారు. డీఈవో కార్యాలయం నుంచి వచ్చిన సహాయ సంచాలకుడు జి.శ్రీరామమూర్తి, డీఈవో కార్యాలయ పర్యవేక్షకులు రామకృష్ణ, సాంబమూర్తిలతో విచారణ చేపట్టామన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ లోగిస మహేష్ ఇటీవల ప్రిన్సిపాల్ అవినీతి అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని డిప్యూటీ డీఈవో తెలిపారు. ప్రిన్సిపాల్ విద్యార్థులకు యూనిఫారాలు, పుస్తకాలు సక్రమంగా అందించడం లేదని, యూనిఫారం వేరేచోట అధిక ధరలకు కొనుగోలు చేశారని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాల మౌలిక వసతుల కల్పనకు నగదు వసూలు చేశారని.. ఇలా 15 అంశాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఒక్కొక్కటిగా రాత పూర్వకంగా వారి ఇద్దరి నుంచి సమాధానాలు తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి తీసుకున్న పత్రాలను డీఈవో, ఆర్జేడీకి పంపిస్తామని చెప్పారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

కొడవలితో దాడి.. మహిళకు గాయాలు

సంతకవిటి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పుల్లిట గ్రామానికి చెందిన ప్రమోదుల ఆశాజ్యోతిపై అదే గ్రామానికి చెందిన కుప్పిలి అన్నారావు కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం ఆశాజ్యోతి స్నానానికి వెళ్తుండగా తన పిల్లలు వెంటబడ్డారు. మార్గమధ్యలో రహదారిపై కుప్పిలి అన్నారావుకు చెందిన ఆవులను కట్టి ఉంచారు. దీంతో ఆమె.. పిల్లలు తిరుగుతుంటారు, రహదారిపై ఆవులు కడితే పిల్లలపై దాడి చేస్తాయని అడిగింది. దీంతో అన్నారావు ఆశాజ్యోతిల మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో ఆశాజ్యోతిపై అన్నారావు కొడవలితో దాడిచేశాడు. దీంతో ఆమెకు చెవి దగ్గర రక్తస్రావం అయి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్వాధీనం

పాలకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలోని కీసర గూడ జంక్షన్ వద్ద పోలీసులు 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. శనివారం అక్కడ గస్తీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆయన్ను ఆపి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన వద్ద 20 లీటర్ల సారాతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చింతపల్లి తీరంలో శుభ్రతా కార్యక్రమం


చింతపల్లిలో శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పూసపాటిరేగ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ తీర శుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చింతపల్లి సముద్ర తీరంలో కాలుష్యనియంత్ర మండలి, పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ అధికారులు సంయుక్తంగా శనివారం శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. అటవీ మంత్రిత్వశాఖ నుంచి ఎంపిక చేసిన నోడల్ అధికారి రితేష్ యాదవ్, డా.బీబీ సరిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బీచ్‌లో పడిఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, తీర ప్రాంత పోలీసు సిబ్బంది, పర్యావరణ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా ఒక చెట్టు - ఒక తల్లి పేరుతో బీచ్ వద్ద 100 మొక్కలను నాటే కార్యక్రమం కూడా చేపట్టారు.

గురుదేవ సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాయి

కొత్తవలస, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటబుల్ ట్రస్టు సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాయని విర్కో సంస్థల ఎండీ టి.ప్రవీణ అన్నారు. మంగళపాలెంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విర్కో సంస్థల ద్వారా పలు సేవా కార్యక్రమాలను గురుదేవ ట్రస్టుతో కలిసి పంచుకుంటున్నామని చెప్పారు. అనంతరం ఆమె 200 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను, భజన బృందాలకు, అంధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్.. విర్కో సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు వైస్ చైర్మన్ ఫణీంద్ర పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు కృషి చేయండి

మెరకముడిదాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు సూచించారు. మండలంలోని బుదరాయవలస పోలీసు స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన సీఐ శంకరరావుతో కలిసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జనవరి నెలలో ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించాలని, ఎన్నిలకు సంబంధించి శాఖాపరమైన సమగ్ర వివరాలను సిద్ధం చేయాలని ఎస్ఐ లోకేష్‌కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడండి

జామి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండారు పెదబాబు కోరారు. ఈ మేరకు ఆయన శనివారం విజయనగరంలో ఇన్‌చార్జి జేడీ భారతిని కలిసి, వినతిపత్రం అందజేశారు. మండలానికి 50 టన్నుల యూరియా అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

ప్రజలకు సేవలందించేందుకు సహకరిస్తాం

● కలెక్టర్‌ను కలిసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు



కలెక్టర్ ప్రభాకరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐఎంఏ నాయకులు

పార్వతీపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆ సంఘ నాయకులు తెలిపారు.ఈ మేరకు శనివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకరరెడ్డిని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.వివేక్, కార్యదర్శి జి.వాసుదేవరావు, ట్రెజరర్ డాక్టర్ భోగేశ్వరరావు కలెక్టర్‌ను కలిసి అభినందించారు.

అబద్ధపు ప్రచారంతో జగన్ మోసం: మంత్రి



పార్వతీపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ అబద్ధపు ప్రచారంతో ప్రజలను మోసం చేసిందని, వైద్యరంగాన్ని దెబ్బతీసిందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి వైద్య భద్రత, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ, ప్రతి పౌరుని ఆరోగ్యానికి భరోసా అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు.ఈమేరకు ఆమె శనివారం విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు తమ ప్రభుత్వకాలంలోనే వైద్య కళాశాల నిర్మాణం జరుగుతుందని, పార్వతీపురం, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అధునాతన వైద్య సదుపాయాలు అందించేందుకు పీపీపీ పద్ధతిలో కొత్త మెడికల్ కళాశాలలను త్వరగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటుచేస్తున్నట్టు ప్రజలను మోసం చేశారని, వైసీపీ హయాంలో వైద్యకళాశాల ఏర్పాటుకు స్థలమైన ఖరారు చేశారా అని ఆమె ప్రశ్నించారు. 17 మెడికల్ కళాశాలలను నిర్మించామని జగన్ చెప్పిన మాటలు పచ్చి అబద్ధమని, ఐదేళ్లలో రాష్ట్ర ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన 1451 కోట్లు రూపాయల్లో 975 కోట్లు పీజీమెడికల్ సీట్లకు ఇవ్వగా మరో 476 కోట్లు వేరే పనులకు మళ్లించారని విమర్శించారు. 14 వైద్యకళాశాలల నిర్మాణానికి అవసరమయ్యే 8480 కోట్లలో రాష్ట్రం నుంచి ఒక్కపైసా కూడా పెట్టకపోవడం జగన్ నిర్లక్ష్యానికి గత వైసీపీ ప్రభుత్వంలో నిదర్శనమన్నారు.

జంఝావతి నుంచి నీరందించాలి

● ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న జగదీశ్వరి

కురుపాం/గుమ్మలక్ష్మీపురం,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేసి సాగు, తాగునీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వవిప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు.ఈమేరకు అమరావతిలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జగదీశ్వరి ఫోన్‌లో మాట్లాడుతూ భద్రగిరి ఆసుపత్రిలో 100 పడకల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని, గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పూర్తికి నిధులు మంజూరు చేసి 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని, గుమ్మలక్ష్మీపురంలో అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియాన్ని పూర్తిచేయాలని కోరినట్లు చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన పారా అథ్లెటిక్స్ క్రీడాకారిణికి సాయంచేయాలని, చిన్నతరహా జీడి పిక్కల పరిశ్రమ ఏర్పాటుచేసి ఉపాధి కల్పించాలని కోరారు.

టొంపలపాడులో వైద్య శిబిరం



కురుపాంరూరల్: టొంపలపాడులో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వల్లి

కురుపాం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో టొంపలపాడులో నీలకంఠాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు.ఈసందర్భంగా వైద్యాధికారి కేఎంకే వల్లి 115మంది గిరిజన మహిళలతోపాటు బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు వైద్య సేవలందించారు. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ద్వారా ఈనెల 17వ తేదీ నుంచి మహిళలకోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వచ్చే నెల రెండో తేదీ వరకూ వైద్య సేవలనుఅదిస్తామని వల్లి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జి. శ్రీహరిరావు, హెల్త్ విజిటర్ వి.గంగమ్మ పాల్గొన్నారు.

●సాలూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 321 మందికి వైద్య పరీక్షలు చేశారు. సూపరింటెండెంట్ మీనాక్షి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

●సీతానగరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):జోగింపేట కేజీబీవీ, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలల్లో వైద్యశిబిరం సీహెచ్ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.రెండు పాఠశాలల్లో 70 మందికి వైద్య పరీ క్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఉషారాణి తెలిపారు. అలాగే లక్ష్మీపురంలో పెదంకలాం వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వంచారు.

కోళ్లను మింగిన కొండచిలువ



కోళ్లను మింగిన కొండచిలువను హతమార్చిన దృశ్యం

మక్కువ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మక్కువలోని సువర్ణముఖీ నది ఒడ్డున గల కోళ్లఫారంలో కోళ్లను పది అడుగుల గల కొండచిలువ మింగింది. ఈమేరకు శనివారం కోళ్లను మింగుతున్న సమయంలో ఫారంలో అలజడి నెలకొనడంతో కోళ్లఫారం నిర్వాహకుడు వెంటనే కొండచిలువను బయటకు గ్రామస్థుల సహాయంతో తీసుకొచ్చి హతమార్చారు. వెంగళరాయసాగర్ రిజర్వాయరు నుంచి నదిలోకి నీరువిడిచిపెడుతుండడంతో కొండచిలువలు గ్రామంలో వస్తున్నాయని పలువురు తెలిపారు.

పార్వతీపురంలో విశ్వశాంతి హోమం

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగన్నాథపురం నాయుడువీధిలో విశ్వకర్మ జయంతి మహోత్సవాల్లో పురస్కరించుకుని శనివారం పార్వతీదేవి కార్పెంటరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విశ్వశాంతి హోమం నిర్వహించారు.అనంతరం కార్పెంటరీవర్కర్స్ యూనియన్ నాయకులు జవ్వాది వెంకటరమణ నిర్వహణలో పూజలు చేపట్టారు. సాయంత్రం విశ్వకర్మ భగవానుని అనుపోత్సవం నిర్వహించారు.

తోటపల్లిలో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):తోటపల్లిలోఇని వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయ ఆలయాల్లో ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా శ్రీవారిసేవకులు సేవలు అందించారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మజ్జి శోభారాణి కోరారు. శనివారం పార్వతీపురం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈసందర్భంగా 19శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను చదివి వినిపించారు.సమావేశంలోఎంపీడీవో కె.సత్యం, వైస్ ఎంపీపీ రవికుమార్, ఎంపీటీసీ కర్రి శ్రీనివాసరావు,ఏఎంసీ చైర్మన్ గొట్టాపు గౌరి, వైస్ ఎంపీపీలు రవికుమార్, సిద్ద జగన్నాథం, ఏవో రమణమూర్తి పాల్గొన్నారు.

పనిగంటల పెంపును ఉపసంహరించాలి

పాలకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగులు చట్ట బద్ధ హక్కు ఎనిమిది గంటల పనిదినాన్ని 13 గంటలుగా పెంచే ఆలోచనను ఉపసంహరించుకోవాలని సీఐటీయూజిల్లా అధ్యక్షుడు దావాలరమణారావు డిమాండ్‌చేశారు. శనివారం పాలకొండలో సీఐటీయూఆధ్వర్యంలో పనిగంటలు పెంచే ఆలోచన ఉపసంహరించుకోవాలన్న పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణరావు,రాము,ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జియ్యమ్మవలస, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):జియ్యమ్మవలసలో సత్యసాయి జయంతి పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జియ్యమ్మవలస జడ్పీహెచ్ఎస్, టీడబ్ల్యూహెచ్ ఆర్ఆర్‌బీపురం పాఠశాలల్లోని 8, 9,10 తరగతులకు చెందిన 47 మంది విద్యార్థులు హాజరయ్యారు.కార్యక్రమంలో హెచ్ఎంలు కేఏఎస్ కుమార్, వి.ధనుంజయనాయుడు, తిరుపతి పాల్గొన్నారు.

'సుపోషిత్ భారత్ - సక్షం భారత్'పై అవగాహన

సీతానగరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెలవలసలో సుపోషిత్ భారత్-సక్షం భారత్ ర్యాలీని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.రాజ్యలక్ష్మి నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సుపోషిత్ భారత్ -సక్షం భారత్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వై.రేవతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఇంటి ముట్టడికి యత్నం

సాలూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):ఆదివాసీలకు ప్రత్యేకడీఎస్సీ నిర్వహించాలని పేర్కొని పట్టణంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇంటిని ముట్టడించేందుకు శనివారం ప్రయత్నించారు.అయితే రూరల్ సీఐ రామకృష్ణతోపాటు పోలీసులు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారు.

డివైడర్‌ను ఢీకొట్టిన గ్రానైట్ లారీ

సీతంపేటరూరల్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి కొత్తూరు నుంచి పాలకొండ వైపు గ్రానైట్ రాయిలోడుతో వెళ్తున్న లారీ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో అదుపుతప్పి డివైడర్‌పైకి వెళ్లింది. అయితే ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడం, జనసంచారంలేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డివైడర్‌పై ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలను లారీఢీకొనడంతో అవి నేలకొరిగాయి.



గరుగుబిల్లి: రావివలసలో మొక్క నాటుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు



సాలూరు: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

● జిల్లాలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు కోరారు. మూడో శనివారం పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ప్రభుత్వకార్యాలయాల ఆవరణల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలు నాటారు.

● సాలూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):సాలూరు పురపాలకసంఘంలోని గాంధీపార్కులో కమిషనర్ టి.రత్నాకుమార్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ పర్యవేక్షణలో మొక్కలునాటారు.కార్యక్రమంలో హనుమాన్ వ్యాయామశాల సభ్యులు, పర్యావరణ కార్యదర్శులు, శానటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

● పాలకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలులో మొక్కలు నాటారు.కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ బి.జోగులు,లీగల్ అడ్వయిజర్ ఎం.వెంకటేశ్వరరావు, విజయకుమార్, సత్యారావు, నరసింహులు పాల్గొన్నారు.

● కురుపాం,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కురుపాంలో పరిశుభ్రత, మొక్కలు నాటే పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, కొండయ్య పాల్గొన్నారు.

●బెలగాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):పార్వతీపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు.

●గరుగుబిల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు కోరారు. రావివలస పీహెచ్‌సీలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, ఎపిడిమియాజిస్ట్ సూర్యకౌశిక్ పాల్గొన్నారు.అలాగే రావుపల్లిలో ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

●సీతానగరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):సీతానగరంలో వివిధ శాఖల అధికారులతో మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో కె.కుమారవర్మ స్వచ్ఛాంధ్ర గురించి వివరించారు.

●మక్కువ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శంబర, వెంకటభైరిపురం, కాశీపట్నం, పనసభద్ర, చెముడుల్లోసచివాలయలఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, మొక్కలునాటారు.

●కొమరాడ, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):పిసినిలో ఎంపీటీసీ వెంకటనాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొమరాడ మండల వైద్యాధికారి దేవేంద్ర, ఉప సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో ఎంపీడీవో శ్రీనివాసరావుఆధ్వర్యంలో ఎంపీడీవోకార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీకమిషన్ మెంబర్ కడ్రకమల్లేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ కళావతి, సుదర్శనరావు, రొబ్బాలోవరాజుపాల్గొన్నారు.

●వీరఘట్టం,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):వీరఘట్టంలో ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, ఈవో బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వేడుకలకు వేళాయే..

(5వ పేజీ తరువాయి)

సాగించాల్సి ఉంటుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాజాం, వీరఘట్టం వైపు , శ్రీకాకుళం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు , పాలకొండ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లాల్సిన వాహనాలు యథావిధంగా నడుస్తాయి.' అని డీఎస్పీ తెలిపారు.

రాజాం వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద పార్కింగ్ ఏర్పాటుచేశాం.శ్రీకాకుళంవైపు నుంచి వచ్చే వాటికి ఆర్టీవోకార్యాలయం పక్కన, వీరఘట్టం వైపు నుంచి వచ్చే వాహనాలకు వీరఘట్టం జంక్షన్ వద్ద ఖాళీ స్థలంలో పార్కింగ్ ఇచ్చాం. సీతంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు ఆర్డీవో కార్యాలయం వద్ద పార్కింగ్ చేయాల్సిఉంటుంది.సమావేశంలో సీఐ ప్రసాదరావు,ఎస్ఐ ప్రయోగమూర్తి పాల్గొన్నారు.

బడులకు సెలవులు

(5వ పేజీ తరువాయి)

పయనమయ్యారు. తల్లిదండ్రులు ఆశ్రమ పాఠశాలలకు చేరుకోవడంతో విద్యార్థులు ఆనందంతో పెట్టెలు, పుస్తకాలు సర్దుకుని ఇంటి బాట పట్టారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామంలోని రహదారులు మార్కెట్ ప్రాంతం కళకళలాడాయి. బస్సులు, వివిధ ప్రైవేట్ వాహనాలు రద్దీగా కనిపించాయి.

భామిని: పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల విద్యార్థులు శనివారం సాయంత్రం ఒక్కసారిగా భామిని బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే బస్సులు రాకపోవడంతో గంటన్నరపాటు అక్కడ నిరీక్షించారు. బత్తిలి, కొరమ నుంచి మండల కేంద్రానికి వచ్చిన విద్యార్థులకు సైతం అవస్థలు తప్పలేదు. ఆ తర్వాత ఓ బస్సు రాగానే వారంతా ఎగబడ్డారు. సీట్ల కోసం పోటీబడ్డారు. ఫుట్‌పాత్‌పై బ్యాగ్‌లతో నిల్చొని ప్రమాదకరంగా ప్రయాణించారు. కొంతమంది విద్యార్థినులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

ఆదుకోరూ!

(5వ పేజీ తరువాయి)

కుటుంబానికి ఇచ్చేవారు. ఇంట్లో 18 సంవత్సరాలు నిండిన వారు చనిపోయినా ఈ పథకం వర్తింపజేసేవారు. ఒక్కో క్లయిమ్ నమోదుకు గాను బీమా మిత్రకు రూ. 250 నుంచి రూ. 500 వరకు టీడీపీ ప్రభుత్వం చెల్లించేది.

వైసీపీ పాలనలో..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీమా మిత్రలను తొలగించింది.వలంటీర్ల ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో వైఎస్ఆర్ బీమా పేరిట పథకాన్ని కొనసాగించారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం పొందినా రూ. 5 లక్షలు, సహజ మరణానికైతే రూ. 2 లక్షలు ఇచ్చేవారు. 51 - 70 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం పొందినా రూ. 3 లక్షలు ఇచ్చేవారు. అయితే కేవలం ఇంటి యజమాని చనిపోతేనే ఈ పథకం వర్తింపజేసేవారు. 2023-24లో అయితే వైసీపీ అధికారంలో ఉన్న చివరి సంవత్సరంలో చాలా మందికి ఈ క్లయిమ్‌లు కూడా చెల్లింపులు చేయలేదు.

కూటమిపై ఆశలు..

2024, జూన్ తరువాత చంద్రన్న బీమా పొందని బాధిత కుటుంబాలు ఇప్పుడు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నాయి. తెలుపు రేషన్‌కార్డు ఉన్న కుటుంబం రూ. 15 కడితే రూ. 1.5 లక్షల నుంచి రూ. 10 లక్షలు వరకు బీమా వర్తింపజేయాలని, తక్షణ సహాయం కింద రూ. 10 వేలు అందజేయాలని మొదటి కేబినేట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే 2024 జూన్ నుంచి ఈ పథ కాన్ని వర్తింపజేస్తుందో.. లేక కొత్తగా పథకం ప్రారంభిస్తుందో అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కాగా బాధిత కుటుంబాలన్నింటికీ న్యాయం చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు. దీనిపై డీపీఎం రజనిని వివరణ కోరగా.. 'బీమాకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదు. మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.' అని తెలిపారు.

ప్రతి సచివాలయం పరిధిలో పరిశ్రమ ఉండాలి

(5వ పేజీ తరువాయి)

బహుమతులు అందిస్తామని వెల్లడించారు. ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న వారికి రూ.3వేలు, తృతీయ బహుమతి పొందిన వారికి రూ.2వేలు చొప్పున అందిస్తామన్నారు.

సమష్టి కృషితో స్వచ్ఛ పార్వతీపురం

బెలగాం: సమష్టి కృషితోనే స్వచ్ఛ పార్వతీపురం సాధ్యమవు తుందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులంతా ఇందులో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ పార్క్‌లో స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మొక్కలు నాటి అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ పార్వతీపురానికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఒక్కరోజుతోనే కాదని ఈ కార్యక్రమాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. రోజూ ఇంటి పరిసరాలు, కార్యాల యాలు వాణిజ్య, వ్యాపార సంస్థలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే స్వచ్ఛ పార్వతీపురం సాధ్యమవుతుందన్నారు. పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. శ్రీనివాస్, కౌన్సిలర్ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా సిద్ధం చేయాలి

సాలూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా పక్కగా సిద్ధం చేయాలని సాలూరు నియోజకవర్గం ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి తెలిపారు. శనివారం సాలూరు తహసీల్దార్‌కార్యాలయంలో రాజకీయనాయకులు, ప్రతినిధులు, బీఎల్వోలతో వేర్వేరుగా ఆమె మాట్లాడారు. ఓటరు జాబితా ప్రకారం ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించాలని, కొత్త ఓటర్లను నమోదుచేయాలని, శాశ్వతంగా వలన వెళ్లిన ఓటర్లను గుర్తించాలని తెలిపారు. పోలింగ్ బూత్‌లు దూరంగా ఉన్న ఓటర్లు జాబితా గుర్తించాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు ఆగవని ఉమ్మడి జిల్లాల విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ లక్ష్మణ్ తెలిపారు. పార్వతీపురంలోవిద్యుత్‌సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన రిలేదీక్ష రెండోరోజుకు చేరుకుంది.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి హెచ్చరించారు. శనివారం మండలంలో అక్రమంగా మద్యం కేసుల్లో పట్టుబడిన ఎనిమిది మందిని తహసీల్దార్ పి.బాల ఎదుట హాజరుపరిచారు.

ఎస్‌హెచ్‌జీల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

గరుగుబిల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తెలిపారు. శనివారం గరుగుబిల్లిలో మన డబ్బులు -మన లెక్కలపై అవగాహనతోపాటు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించడంతోపాటు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, కె.ఇందుమతి, పి.అప్పలనాయుడు, భారతి, తిరుపతిరావు, రామినాయుడు, వి.లక్ష్మణరావు, కె.మరియాదాసు పాల్గొన్నారు.

నవంబరు ఏడో తేదీ నుంచి నాటక పోటీలు

జియ్యమ్మవలస, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదమేరంగి కూడలి సమీపంలో నవంబరు 7, 8, 9 తేదీల్లో తెలుగు రాష్ట్రాల నాటక పోటీలను నిర్వహించనున్నట్లు మేరంగి నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు తెలిపారు. శనివారం మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, మేరంగి యువ నాయకులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మేరంగి నాటక పరిషత్ సహ ప్రెసిడెంట్ వాన నారాయణరావు, ఉపాధ్యక్షులు బలగ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి రౌతు విజయకుమార్, కోశాధికారి ఆర్.అజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిశోర్ పాల్గొన్నారు.

వీరఘట్టంలో వర్షం

వీరఘట్టం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం, పరిసర గ్రామాల్లో శనివారంరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మూడు రోజుల నుంచి ఎండతీ వ్రతకు ప్రజలు అల్లాడిపోయిన తరుణంలో కురిసిన వర్షం ఊరటనిచ్చిందని పలువురు తెలిపారు. ఈ వర్షం వల్ల ప్రస్తుతం వరి పైరుకు నీటి సమస్య తీరిందని రైతులు చెప్పారు.

పుస్తకాల వితరణ

పాలకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):పాలకొండ శాఖా గ్రంథాలయానికి శనివారం ఇంటర్ 1987 బ్యాచ్ విద్యార్థులు పుస్తకాలను అందజేశారు. గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబుకు పుస్తకాలతోపాటు పుస్తకాల స్టాండ్‌ను అందించారు.కార్యక్రమంలో రామ్‌గోపాల్, ఉమా మహేశ్వరరావు, మల్లిఖార్జునపట్నాయక్, పైల శశిధర్, బలివాడ శ్రీధర్‌తో పాటు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ పాఠశాల పరిశీలన

సీతానగరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్జ జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం డీఈవో రాజ్‌కుమార్ పరిశీలించారు.ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతి, విద్యా శక్తి, క్లస్టర్, అటెండెన్స్, మార్కులు నమోదు, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సాంబశివరావు, నిడగల్లు,మరిపివలస హెచ్ఎంలు పాత్రుడు, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తవిటినాయుడు, రిసోర్స్ పర్సన్ కూర్మినాయుడు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలి

వీరఘట్టం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో ఆనందరావు కోరారు. శనివారం మండలంలోని కత్తుల కవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సుధారాణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.